రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## 23 నుంచి యథావిధిగా ప్రజావాణి : కలెక్టర్



రంగారెడ్డి అర్బన్ , ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం లక్ష ్యంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 23 నుంచి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశామని, మళ్లీ కొనసాగించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

## ఎంపి ఈటల రాజేందర్ హౌస్ అరెస్ట్



మేడ్చల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఇంటిపై దాడి నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు బయలు దేరిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. ఏసీపీ శంకర్‌రెడ్డితో సహా పెద్ద ఎత్తున పోలీసులు గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో పూడూర్ గ్రామ శివారులోని ఎంపీ ఈటల నివాసానికి తరలివెళ్లి ఆయనను ఇంటి నుండి బయటకు రాకుండా అడ్డుకున్నారు. కాగా ప్రభుత్వ వైఖరి, పోలీసుల తీరును తీవ్రంగా ఖండించిన ఎంపీ ఈటల ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండాయిజం చేస్తూ ప్రజా స్వామ్య విలువలను ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



# ఇంటింటికి సోలార్ యూనిట్

**కొడంగల్ మండలంలో రూ.150 కోట్ల వ్యయంతో పైలట్ ప్రాజెక్టు**

**ప్రతి ఇంటికి 2 కెవి ప్యానెల్**

**40,349 మందికి సౌర విద్యుత్ సదుపాయం**

**వ్యవసాయ పంపుసెట్లకూ అనుసంధానం**

**విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారనున్న వినియోగదారులు**

**రైతుకు ఏటా రూ.18 వేలు అదనపు ఆదాయం**

**ప్రాజెక్టు నూరుశాతం అమలుపై సిఎం ప్రత్యేక శ్రద్ధ**

**40 రోజుల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు**

**మోడల్ సోలార్ విలేజ్ పథకంపై ఇందన శాఖ అవగాహన**

కొడంగల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : కొడంగల్ మండలంలో రూ.150 కోట్ల వ్యయంతో, 34 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా సోలార్ మోడల్ విలేజ్ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. మండలంలోని గృహజ్యోతి లబ్ధిదారులైన 40,349 మందికి సోలార్ విద్యుత్ సదుపాయం కలిగించటానికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇల్లు మరియు వ్యవసాయ పంపుసెట్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారనుంది. ప్రజలు సొంతంగా సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ, అదనపు ఆదాయాన్ని పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి సోలార్ యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ వినియోగదారులను ఉత్పత్తిదారులుగా మార్చనున్నారు. ఈ పథకం వల్ల ప్రతి ఇంటికి ఏటా సుమారు రూ. 5,000, అదే విధంగా ప్రతి రైతు ఏటా రూ 18 వేల వరకు అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా. గృహ అవసరాలతో పాటు, వ్యవసాయ పంపుసెట్లకు కూడా సౌర విద్యుత్‌ను అనుసంధానించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల కొడంగల్ ప్రాంతంలో సోలార్ విద్యుత్ వినియోగం పెరిగి, పర్యావరణ అనుకూల ఇందన ఉత్పత్తికి దారితీస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

**ప్రతి రైతుకు 7.5 కెవి ప్లాంట్**

ఇందులో భాగంగా శనివారం కొడంగల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మోడల్ సోలార్ విలేజ్ పథకంపై ఇందన శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్‌ను దేశంలోనే తొలి సోలార్ విద్యుత్ వినియోగ మండలంగా ప్రకటించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. మండలంలోని 34 గ్రామాల్లో ప్రతి ఇంటిపైన రూఫ్ టాప్‌తో పాటు మోటర్ పంపుల దగ్గర సోలార్ పలకలను అమరస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి 2 కిలో వాట్ల సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గృహాలకు అవసరమైన విద్యుత్‌ని వినియోగించుకొని తిరిగి ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశం ఈ సోలార్ వ్యవస్థ ద్వారా ఉందన్నారు. ప్రజలు వినియోగించుకోగా మిగిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపిస్తే ప్రతి వినియోగదారుడు విద్యుత్ శాఖ నుండి సంవత్సరానికి దాదాపు రూ.5వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రైతులకు మోటర్ పంప్ సెట్ల దగ్గర 5హెచ్‌పీ మోటారు ఉన్న చోట 3.5 సోలార్ మోటర్ పంపుసెట్ అమర్చితే సరిపోతుందని, కానీ ముఖ్యమంత్రి రైతులకు లాభం చేకూర్చాలనే ఉద్దేశ్యంతో 7.5 కిలోవాట్స్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయమని ఆదేశించారని వివరించారు. దీనివల్ల రైతు సంవత్సరానికి కష్టపడకుండా రూ.18వేలు సంపాదించుకునే అవకాశం కలుగుతుందన్నారు.

**మోటార్లకు రిమోట్ కంట్రోల్ సదుపాయం**

సోలార్ మోటార్లను సెల్ ఫోన్ ద్వారా అన్, అఫ్ చేసుకోవచ్చన్నారు. రానున్న 30, 40 రోజుల్లో మండలం మొత్తం అమలు చేసేలా తమ కార్యచరణ ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ రూ.150 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ బ్రహత్తర పథకాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతుకు ఆదాయం అందించాలనే లక్ష్యంతో సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో అమలు చేయడం జరిగిందని, ప్రస్తుతం సీఎం స్వంత నియోజకవర్గం కొడంగల్ మండలంలోని 34 గ్రామాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టీజీ రెడ్కో ఎండీ అనిలా మాట్లాడుతూ కొడంగల్ మండలంలోని 34 గ్రామాల్లో 40,349 గృహాలకు సోలార్ ప్యానెల్‌ను అమర్చనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఎం సోదరుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ సోలార్ పథకానికి కేంద్ర ప్రభుత్వం 40శాతం సబ్సిడీని అందిస్తున్నదని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు లేవనెత్తిన అంశాలపై అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రవిప్రసాద్, కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, ఏఎంసీ చైర్మేన్ అంబయ్యగౌడ్‌లతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# సమర్థ నాయకత్వమే లక్ష్యంగా



ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నూట నలభై ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో లేని విధంగా కొత్త పుంతలు తొక్కే విధంగా ఏఐసీసీ దృష్టి సారించింది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే కాకుండా నాయకత్వ లక్షణాలను పెంపొందించే

## ఏఐసిసి కొత్త పుంతలు

**జిల్లాల పార్టీ రధసారథులకు నిష్ణాతులచే శిక్షణ**

**సచిన్‌రావు సారధ్యంలో ట్రైనింగ్**



దిశగా అడుగులు వేస్తోంది. క్రమశిక్షణ గల కార్యకర్తలను తయారు చేసేందుకు సన్నద్ధం చేశారు. ఇతర జాతీయ పార్టీలకు ధీటుగా పార్టీలో విన్నూత్న మార్పులు తీసుకురావాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తోంది. ఏఐసీసీ ముఖ్యనేతలు, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు సుదీర్ఘ చర్చలు జరిపి కారక్రమాలను రూపొందించారు. అందులో భాగంగానే సంఘటన సృజన్ అభియాన్ కారక్రమానికి శ్రీకారం చుట్టారు. కర్నాటకు చెందిన సచిన్‌రావు సారధ్యంలోని ట్రైనింగ్ బృందం రెండు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు 9 రోజుల పాటు శిక్షణను ఇస్తున్నారు. అందుకు వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌ను వేదికగా ఎంపిక చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల శిక్షణ శిబిరం ఈ ప్రాంతంలో నిర్వహించడం అరుదైన అంశంగా పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

తొలిరోజు సీఎం రేవంత్‌రెడ్డి, రెండు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ నేతల ప్రసంగాలతో ముగిసినా రెండవ రోజైన ఆదివారం నుంచి కఠినమైన శిక్షణ ఇవ్వనున్నారని పార్టీవర్గాల సమాచారం. 2వ రోజు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం, చరిత్ర, చరక గురించి ఉపోద్ఘాతం, రాష్ట్ర రాజకీయాల చరిత్ర గురించి ఆచార్య కోదండరామ్, పల్లం రాజు వివరించనున్నారు. 3వ రోజు కులం, సామాజిక న్యాయం, కుల రాజకీయాలు అనే అంశంపై ఎస్.సెంథిల్ చర్చించనున్నారు. రాష్ట్ర అంశాలపై ఆచార్య కంచె ఐలయ్య, రఘువీరారెడ్డి వివరించనున్నారు. ఫీల్డ్ విజిట్ గురించి కూడా భోధించనున్నారు. 4వ రోజు గ్రామాల సందర్శన, క్షేత్రస్థాయి పథకాల గురించి, 5వ రోజు రాజకీయాల్లో పురుషులు, మహిళల పాత్రపై మీనాక్షి వివరిస్తారు. వ్యవసాయరంగం – రాజకీయాలు అంశంపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనలు ఇవ్వనున్నారు. 6వ రోజు సెక్యులరిజం రాజకీయాలు, ఆధిపత్యపోరు అంశాలపై ఇమ్రాన్ ప్రతాపఘడి రిజ్వాన్‌అర్షాద్ తదితరులు వివరిస్తారు. 7వ రోజు హక్కులు, భూహక్కులపై రాజకీయాలు, ఫీల్డ్ విజిట్‌పై కే.రాజు ప్రసంగిస్తారు. 8వరోజు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ గురించి, 9వ రోజు ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు అంశంపై ప్రవీణ్‌చక్రవర్తి, రాష్ట్ర ప్రణాళిక, అనుసరిస్తున్న వ్యూహాలపై ప్రముఖులు మాట్లాడనున్నారు.

ఉదయం 6 గంటలకు డీసీసీ అధ్యక్షులను నిద్ర లేపడం మొదలుకుని రాత్రి 10 గంటల వరకు వివిధ కార్యక్రమాలను వలంటీర్లు దగ్గరుండి చేపట్టనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కారక్రమాలను నిర్వహించనున్నారు. హైదరాబాద్‌చెందిన ప్రముఖ వంటవారిచే రుచికరమైన భోజనం వడిస్తున్నారు. అయితే, మద్యం సేవించం నిషేధించారు. ఎవరైనా బయటకు వెళ్లి మద్యం సేవించినట్లు తెలిస్తే శిబిరం నుంచి పంపించాలని ఏఐసీసీ ఆదేశాలు ఉన్నట్లు తెలిసింది. శిబిరం నుంచి వికారాబాద్ పట్టణానికి కూడా వెళ్లేందుకు అనుమతులు లేవని సమాచారం. ఒకవేళ డీసీసీ అధ్యక్షుల ఇంటి నుంచి అత్యవసర ఫోన్లు వస్తే ఒకటి లేదా రెండు రోజుల మాత్రమే వెళ్లేందుకు అనుమతించనున్నారు. గైర్హాజరైన వారికి సర్టిఫికేట్లు కూడా ఇవ్వరాదన్న నిబంధనలు విధించినట్లు తెలిసింది.

## పనులు చేయకుండానే

# బిల్లులు చెల్లింపులు

**సంబంధిత అధికారుల సంతకం లేకుండానే డ్రా**

**సామాజిక తనిఖీలో బయటపడ్డ అక్రమాలు**

**రూ. 18 వేలు పెనాల్టి- రూ.2.5 లక్షలు రికవరీ చేయాలని ఆదేశం**

**అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు**

**డిఆర్‌డిఎ ఏపిడి హెచ్చరిక**



పెద్దేముల్, పిబ్రవరి 21, ప్రభాతవార్త: పెద్దేముల్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ తూతూ మంత్రంగా సాగింది. శనివారం మహత్మగాంధి జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకంలో భాగంగా 16వ విడత సామాజిక తనిఖి ప్రజావేదికను నిర్వహించారు. సామాజిక తనిఖీలలో బుద్దారం గ్రామంలో ఒకె ఇంటిలో రెండు జాబ్‌కార్డులు ఇవ్వడంతో డిఆర్‌డిఏ ఏపిడి సరళాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. తట్టెపల్లి గ్రామంలో ఒక వ్యక్తి కూలీ పనులకు వెళ్ళకున్న మూడు వారాల పాటు హాజరు వేయడంతో సంబందిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై మండిపడ్డారు. జయరాంతాండాలో మస్టర్‌పై పంచాయతీ కార్యదర్శి సంతకం లేకుండానే రూ. 4 వేలు డ్రా చేశారు. 10 వేల మొక్కలను పంపిణి చేసామని రికార్డులో రాయగా, క్షేత్రస్థాయిలో వెళ్ళి పరిశీలించగా నర్సరిలో ఆరు వేల మొక్కలు ఉన్నట్లు తప్పుపట్టారు. 22 పనులకు సంబందించిన మస్టర్‌పై యంపిడిఓ సంతకం లేకుండానే చెల్లింపులు చేశారు. అక్కడ పని చేయకుండానే రూ. 18 వేలు డ్రా చేసినట్లు తనిఖీలలో బయటపడ్డాయి. క్యాటిల్ షెడ్‌లో ఫ్లోరింగ్ వేయకున్న రూ. 5200 చెల్లించినట్లు తెలిసింది. సంబందిత అధికారుల సంతకాలు లేకుండానే బిల్లులు డ్రా చేసినట్లు తనిఖీలో వెలుగుచూసాయి. ఆయా గ్రామాలలో ఉపాధి కూలీలు పనులకు వెళ్ళకున్న హాజరు వేసారని తనిఖీలలో బయటపడ్డాయి, ప్రతి యేటా నిర్వహించే మాదిరిగానే సామాజిక తనిఖి నిర్వహిస్తున్నారనే తప్పా, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తంచేశారు. ఆయా గ్రామాలలో సంబందిత అధికారులు, ఎప్ఏలు కుమ్మకై అవకతవకలకు పాల్పడుతున్న ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా చేసేదేమిలేదని పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం కొనసాగిన సామాజిక తనిఖీలో సంతకాలు లేకుండా బిల్లులు డ్రా చేయడం, పనులు జరిగిన చోట నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సంబందిత టిఏ,ఎప్ఏ, పంచాయతీ కార్యదర్శులపై రూ. 18 వేలు పెనాల్టి వేసారు. అంతేగాకుండా అక్కడక్కల పనులు చేయకుండానే బిల్లులు చెల్లింపులు చేయడంతో రూ. 2 లక్షల 50 వేలు రికవరి చేయాలని డిఆర్‌డిఏ ఏపిడి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ రాములు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి భార్గవి, ఎస్ఆర్‌పి రాజు, యంపిడిఓ రతన్‌సింగ్, ఏపిఓ నర్సిములు, సోషల్ ఆడిట్ సిబ్బంది అమృత తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించకుంటే కొరడా

**ఆల్ట్రా సౌండ్ కేంద్రాల నిర్వాహకులకు డిఎంఅండ్‌హెచ్ఓ హెచ్చరిక**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : జిల్లాలోని ఆల్ట్రా సౌండ్ కేంద్రాల నిర్వాహకులు చట్టంలోని నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి స్పష్టం చేశారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సి.ఉమాగౌరి అధ్యక్షతన జిల్లా స్థాయి సలహా సంఘం కమిటీ సమావేశం జరిగింది. (ప్రి–కన్‌స్పెషన్ అండ్ ప్రి–నాటల్ డైయాగ్నొస్టిక్స్ టెక్నిక్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ సెక్స్ సెలక్షన్) చట్ట ప్రకారం జిల్లా స్థాయి సలహా సంఘం సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టం అమలు విధానం, జిల్లాలోని ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ల పనితీరు, కొత్త, పునరుద్ధరణ నమోదు ధరఖాస్తుల పరిశీలన వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ల వారు లింగనిర్ధారణ అనేది చేయరాదని, చేయటం నిషేదం అని ఎవరైనా చట్టాన్ని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్య కఠిన చర్యలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు పిసి అండ్ పిఎన్‌డిటి చట్టాన్ని సమర్ధవంతంగ అమలు చేయటానికి అవసరమైన సూచనలు, సలహాలను అందించారు.

## శివాజీ విగ్రహావిష్కరణ మళ్ళీ వాయిదా

**అఖిలపక్ష సమావేశంలో ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు**

**మనస్థాపానికి గురై రాజీనామాకు సిద్ధమైన సర్పంచ్**

**సమావేశాన్ని బహిష్కరించిన దళిత సంఘాలు**

మహేశ్వరం ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: మహేశ్వరం పట్టణ కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా విష్కరణ ఏర్పాటులో గత 15 రోజులుగా చిలికి చిలికి గాలివానగా మారుతూ వివాదాలకు దారితీస్తోంది. మహేశ్వరం లోని ప్రధాన కూడలి వద్ద అంబేద్కర్ బాబు జగ్జీవన్ రాం విగ్రహాల పక్కనే చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ఏర్పాటు చేయాలని స్థానికంగా కొంతమంది ముందుకు రావడం ఇటీవల అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దీనికి స్థానిక దళిత సంఘాలు వ్యతిరేకించడం పోలీసుల జోక్యంతో అక్కడి నుంచి విగ్రహాన్ని తాత్కాలికంగా గ్రామపంచాయతీ ఆవరణలోకి తరలించిన విషయం అందరికి తెలిసిందే విగ్రహం ఏర్పాటు కోసం అఖిలపక్ష నాయకులు గ్రామ పెద్దలు అందరి ఆమోదయోగ్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని గ్రామ పెద్దలు దళిత సంఘాల నాయకులు అన్ని కులాల వారితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించిన విషయం అందరికీ తెలిసిందే శనివారం శ్రీ శివగంగ రాజేశ్వర రాజరాజేశ్వరి స్వామి ఆవరణలో మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కుల సంఘాల నాయకులు గ్రామ పెద్దలు యువకులు ఒక సమావేశాన్ని నిర్వహించారు. సంఘాల నాయకులు కుల పెద్దలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు కొత్తగా ఎన్నికైన సర్పంచి తో పాటు పలువురు చత్రపతి మహారాజు విగ్రహాన్ని ఏర్పాటు విషయంలో వారి వారి అభిప్రాయాలను వివరించారు. తుది నిర్ణయాన్ని గ్రామ పెద్దలకు మాజీ ప్రజాప్రతినిధులకు ఆయా రాజకీయ పార్టీల నాయకులకు అప్పగిస్తూ ఒక నిర్ణయానికి వచ్చారు అయితే సభ ముగింపులో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మునగపాటి నవీను మాట్లాడుతుండగా కొంతమంది యువకులు కేరింతలు కేకలు వేస్తూ తక్షణమే విగ్రహం ఏర్పాటు కోసం నిర్ణయం తీసుకోవాలని పట్టుబట్టారు దీంతో సర్పంచి నవీన్ మరో ఒక వారంలో విగ్రహం ఏర్పాటు కోసం ఒక ప్రత్యేక కమిటీని దానికి అఖిలపక్ష పార్టీల్లో సీనియర్లతో సమావేశమై ముందుకు సాగుతామని మాట్లాడుతుండగా లేదు తక్షణమే కమిటీని ప్రకటించాలంటూ కొంత మంది యువకులు పట్టుబట్టడం దీంతో సభలో కొంత తరజన భర్జనలు చోటుచేసుకున్నాయి ఒక దశలో ఒకరిని ఒకరు తోసుకోవడం వరకు పరిస్థితులు నెలకొనడం ఈ సంఘటనను గమనించిన దళిత సంఘాల నాయకులు సభను బహిష్కరిస్తూ వెళ్లిపోవడం పరిణామాలు చోటుచేసుకున్నాయి గత 35 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం పక్కనే ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని కేవలం స్వార్థంతో రాజకీయ కోణంలోనే ఏర్పాటు చేస్తున్నారని దీన్ని ఎంత మాత్రం అంగీకరించే లేదని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఇక సభలో ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ కూడా అణగారిన వర్గాల కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తిగా అభివర్ణిస్తూ ఆయన విగ్రహాన్ని కూడా అందరు సహకరించాలని వారు కోరారు సంవత్సరాలుగా సర్పంచ్ పై కొంతమంది యువకులు అభ్యంతరాన్ని ఖండిస్తూ నవీను ఒక దశలో ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ తాను కూడా ఒక హిందూ నేనని తనని కించపరిచే విధంగా విమర్శలు చేయడం ఏమాత్రం తగదని అవసరమనుకుంటే తాను తన సర్పంచి పదవిని కూడా వదులుకోవడానికి సిద్ధమంటూ రాజీనామా చేస్తానంటూ ఈ నిండు సభలో స్పష్టం చేయడంతో సభలో ఒకసారిగా గందరగోళాన్ని నెలకొంది దీంతో గ్రామంలో

## ప్రమాదం జరిగితే వారికి పండగే

**ఘటనా స్థలంలోనే నిలువు దోపిడీ**

**శవాన్ని దోచుకున్న దొంగలు అరెస్టు**

**వివరాలు వెల్లడించిన సిఐ విజయ్ కుమార్**

షాద్‌నగర్, పిబ్రవరి 21, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ఎవరైనా బాధితులకు సహాయం చేస్తారు కానీ ఎప్పుడు జరుగుతుందా బాధితులను నిలువు దోపిడీ ఎలా చేద్దామా అనే ప్రణాళికలోనే ఉంటారు. ప్రమాదం బారినపడి అపస్మారక స్థితిలో ఉన్నా... మృతి చెందినా బాధితుల శరీరం మీద ఉన్న నగలు, నగదును దోచుకుని సొమ్ము చేసుకుంటున్న ఇద్దరిని షాద్ నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు శనివారం పట్టణ సీఐ విజయ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. ఈ నెల 17 వ తేదీ రాత్రి ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ టోల్ ప్లాజా సమీపంలోని బూర్గుల ఎక్స్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా తుర్క యంజాల్ కు చెందిన పురుషోత్తం రెడ్డి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అయితే పురుషోత్తం రెడ్డి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన అతని తమ్ముడు విజయానంద రెడ్డి అన్న మృతదేహంపై ఉన్న బంగారు నగలు కనిపించక పోవడంతో షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు లో బాగంగా నమ్మదగిన సమాచారం మేరకు నిందితులు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా హైవే పెట్రోల్ లో డ్రైవర్ గా పనిచేస్తున్న మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన రవి కుమార్ గౌడ్, కార్మికుడిగా పనిచేస్తున్న ఫరూఖ్ నగర్ మండలంలోని బుర్గగడ్డ తండాకు చెందిన మూడవత్ లోకేశ్ ను అదుపు లోనికి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులు నుండి అనుతురుల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు పట్టణ సీఐ వెల్లడించారు. షాద్ నగర్ డీసీపీ సిహెచ్ శిరీష, ఎసిపి ఎస్ లక్షి ్మ నారాయణ పర్యవేక్షణలో కె విజయ్ కుమార్, డిఐ ఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేసు క్రైమ్ డిఎస్ఐ జి శివ రెడ్డి సిబ్బంది రవీందర్, మోహన్, కర్ణాకర్, జాకీర్, రాజు కేసును ఛేదించడం లో కీలక పాత్ర పోషించినట్లు ఉన్నతాధికారుల ద్వారా వారికి తగిన రివార్డ్ లను అందించడం జరుగుతుందన్నారు..

**టూల్‌కిట్లు, జనరేటర్లు వంద శాతం**

## సబ్సిడీతో పంపిణీ

**మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : తుర్కా కాశి ముస్లీం వర్గానికి రాళ్లు కత్తిరించే టూల్‌కిట్లు,జనరేటర్లు వంద శాతం సబ్సిడీతో, అదే విధంగా ముస్లీం యువతకు ఈ–స్కూటర్లు 80శాతం సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు ఆసక్తి ఉన్న అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ సూచించారు. శనివారం ఆమె పేర్కొంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల ఆర్థికాభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పోరేషన్ (టిజిఎంఎఫ్‌సి) ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం పథకం రెండు ముఖ్యమైన పథకాలను 2025–2026 ఆర్థిక సంవత్సరంకు అమలులోకి తీసుకవచ్చినట్లు ఆమె తెలిపారు. తుర్కా కాశి ముస్లీం వర్గానికి రాళ్లు కత్తిరించే వృత్తి వారికి పునరావాసం, జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా టూల్‌కిట్స్, జనరేటర్లు పంపిణీ పథకం అమలు చేయబడుతుందన్నారు. ప్రతి లబ్దిదారునికి రూ.60వేల చొప్పున రూ.10వేల విలువైన టూల్‌కిట్లు,రూ.50వేల విలువ చేసే జనరేటర్లను 100శాతం సబ్సిడీతో ఒకే సారి అందించటం జరుగుతుందన్నారు.

## రాష్ట్ర స్థాయిలో పరిగి విద్యార్థుల ప్రతిభ

పరిగి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : ఇటీవల నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ పోటీల్లో పాల్గొని బంగారు పథకాలు సాధించి, సత్తా చాటిన పరిగి ఫిట్నెస్ ట్రైక్వాండో అకాడమీ విద్యార్థులు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిచిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎం కప్ లో ఫిట్నెస్ ట్రైక్వాండో అకాడమీ విద్యార్థులైన సాయి రామ్ యు45 విబాగం లో బంగారు పతకాన్ని, ఆకాష్ యు59విబాగంలో రజత పతకాన్ని సాధించారని కోచ్ ఖలీమొద్దీన్ తెలిపారు.. ఖలిముద్దీన్ మాట్లాడుతూ రాష్టంలో రెండు విభాగాలలో తమ అకాడమీ విద్యార్థులు గెలిచినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు..

## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**షాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సిఐ కాంతారెడ్డి అన్నారు. ఏఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా షాబాద్ మండలంలోని సర్దార్ నగర్, మన్మరి, షాబాద్, తాళ్లపల్లి, హోలీ స్పిరిట్, షాబాద్ కేజీబీవీ, నవజీవన్ స్కూల్, బాయ్స్ హై స్కూల్ , శ్రీ చైతన్య స్కూల్, పోతుగల్ స్కూల్, ధ్యానహిత, మోడల్ స్కూల్, హైతబాద్ మోడల్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులకు, పదవ తరగతి విద్యార్థులకు ఏఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎలుగంటి అభిరామ్ అండగా నిలవడం అభినందనీయమన్నారు. దాదాపు 1200 మంది విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ కార్యక్రమం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు అశోక్, ప్రభాకర్ రెడ్డి, యాదయ్య, మహేందర్ గౌడ్, రాజేందర్ రెడ్డి, చెన్నయ్య, నాయకులు సుభాష్ రెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రఫిక్, సూర్య, శ్రీనివాస్, నరేందర్, శేఖర్, అశ్విని, గౌరీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనపై పేరెంట్ టీచర్ సమావేశం

**షాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** షాబాద్ మండలం, ప్రాథమిక పాఠశాల మన్మరి లో విద్యార్థుల తల్లిదండ్రులు, మరియు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి, విద్యార్థుల ప్రగతి పనితీరును తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, మరియు గణిత అంశాలకు సంబంధించి భాష, న్యూమరాసి, పద్య, మరియు గద్య రూపంలో కొన్ని ప్రతిభ పఠన నైపుణ్యాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ... ప్రభుత్వ బడులలో చదువుకునే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా పోటీపడి చదువుతున్నారని, ఉపాధ్యాయులు తరగతిలో బోధించే అంశాలను ఇంటిదగ్గర విద్యార్థులు చదువుతున్నారా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు పర్యవేక్షి ంచాలని, తల్లిదండ్రులు వారి పిల్లల కోసం ఇంటిదగ్గర కొంత సమయం కేటాయించి వారి యొక్క చదువులను క్షుణ్ణంగా పరిశీలించాలని, విద్యార్థుల చదువుల పట్ల ఎలాంటి సందేహాలున్న పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను కలవాలని, విద్యార్థుల చదువులకు సంబంధించిన అంశాల పట్ల చర్చించాలని, ప్రతి ఇంట్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ కార్నర్ ఏర్పాటు చేయాలని తెలపడం జరిగింది. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఇంటిదగ్గర ఆటలు తగ్గించి పాఠశాలలో నేర్చుకున్న అంశాలను ఇంటిదగ్గర తిరిగి చదవాలని తెలపడం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ ప్రథమ పౌరులు లాలాపేట బందెయ్య, వార్డ్ సభ్యులు, రాములు, వెంకటేష్, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, అనురాధ, మమత, రాధిక, కొమరమ్మ, మానెమ్మ, హారిక, ఈదయ, సతీష్, శంకరయ్య, నరసింహులు, బీరయ్య లక్ష్మి ్మ, మాధవి, మరియు ఉపాధ్యాయులు, వెంకటమ్మ, శ్రీలత చంద్రకళ, పాఠశాల సిబ్బంది శ్యామలమ్మ, మల్లమ్మ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

**జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 21, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో రూ.4 కోట్ల 89 లక్షల 55 వేలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో రూ.6 లక్షల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాప చేశారు. అనంతరం జాకారం గ్రామంలో నాలుగు లక్షల తో సిసి రోడ్డు పనులు, ఐదు లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రావిర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని విరసముద్రం గ్రామంలో 7 లక్షలతో వీరసముద్రం నుంచి చెగిరెడ్డి ఘనపూర్, రావిర్యాల వరకు మట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిధంగా చౌదరి గూడెంలో 40 లక్షలతో సిసి రోడ్డు పనులు, బోయగూడలో పద్మారం బీటీ రోడ్డు నుంచి బోయగూడ వరకు ఒక కోటి 43 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా తూంపల్లి లో పది లక్షలతో వివో బిల్డింగ్, నాలుగు లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, లచ్చంపేటలో ఐదు లక్షలతో సిసి రోడ్డు పనులు, రెండున్నర లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రావిర్యాల పరిధిలోని వీరసముద్రం గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గతంలో గ్రామాల అభివృద్ధికి ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరు ఇబ్బందులు పడవద్దని నిర్మించుకునే వారందరికీ ఇందిరమ్మ ఇల్లు విడతల వారిగా మంజూరు చేస్తామని తెలిపారు. అదేవిధంగా వీరసముద్రంలో మంచినీటి బోరు వివో బిల్డింగ్ కు అదే విధంగా సిసి రోడ్డు అండర్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయనున్నట్లు వివరించారు. మండల పరిధిలోని రావిరాల వాగుపై మూడున్నర కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. వచ్చే వర్షాకాలం అని దృష్టిలో ఉంచుకొని పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎక్కువ లోతైన వాగు కారణంగా చేపడుతున్న పనులు ఎదురవుతున్న ఇబ్బందుల పట్ల ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాగు నిర్మాణం జరిగితే బస్సు సౌకర్యానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కుమార్, నీలయ్య, చంద్రశేఖర్, జంగయ్య, శ్వేత చంద్రబాబు గౌడ్, సనా సలీం, బందయ్య, సునీత రాములు, నాయకులు కృష్ణారెడ్డి, కేకే కృష్ణ, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, ఆంజనేయులు, పాపయ్య, సత్యనారాయణ రెడ్డి, పిట్ట రజిత, సలీం, గోపాల్, శివమోళి, గోపాల్, బాల్‌రాజు, మల్లేష్. వెంకట్‌రాములు, వెంకటనర్సింహారెడ్డి, నర్సింహులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మానవాళి విముక్తి మార్గం సోషలిజమే

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ప్రపంచం సోషలిజం వైపు పయనిస్తుందని సీపీఎం సీనియర్ నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్.సబితలు పేర్కొన్నారు. ఘట్‌కేసర్‌లోని సిఐటియు కార్యాలయంలో శనివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్షాలు 1848 ఫిబ్రవరి 21న మొదటిసారి 'కమ్యూనిస్టు ప్రణాళికొ విడుదలైన సందర్భాన్ని పురస్కరించుకొని 2020 నుంచి రెడ్‌బుక్స్ డే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. సోవియట్ యూనియన్ కూలిపోయాక కమ్యూనిజం పాతాళానికి తొక్కబడిందని అది ఇక తిరిగి లేవదని అమెరికా గర్వంగా ప్రకటించిందని పడిలేచిన కెరటం లాగా లాటిన్ అమెరికా దేశాల్లో ఎర్రజెండా రెపరెపలాడుతుందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవాభ్యున్నతికి బాటలు వేస్తుందని సామాజిక రంగంలో శాస్త్రమే కమ్యూనిజమని దాని లక్ష్యం సోషలిజమని సాధన, సాధించే దిశలో ఆయుధమే మార్క్సిస్టు సాహిత్యం దాన్ని యువతరంలోకి తీసుకుపోయి వారికి దిక్సూచిలా మార్చడానికి ఫిబ్రవరి 21న రెడ్‌బుక్స్‌డే నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కె.చంద్రమోహన్, కడమంచి యాదగిరి, వరికుప్పల రాములు, శివారెడ్డి, సిహెచ్.అశాజ్యోతి, ఎన్.భవాని, పి.కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

**ధారూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ధారూర్ మండల పరిధిలోని నాగారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల వివిధ గ్రామాలకు నేడు ఫిబ్రవరి 22 ఆదివారం రోజున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడ ఎంది. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతులు, నిర్వహణ ప నుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగారం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామస్తులు, రైతులు ఈ విషయాన్ని గమనించి, ప ఎల నిర్వహణలో విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు. ప నులు పూర్తయిన వెంటనే సరఫరా ను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

**మేడ్చల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య జరిగిన ఘర్షణ కారణంగా కామారెడ్డి వెళ్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మేడ్చల్‌లో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాకేష్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో కాసేపు ఉద్రిక్త పరిస్తుతులు నెలకొన్నాయి. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిపై హత్యాయత్నానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ రాబోయే బీజేపీ ప్రభుత్వంలో ఇక్కడే నడిరోడ్డుపై రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేయిస్తానని ఆయన ఘాటుగా విమర్శించారు.

## రెడ్ బుక్ ఒక ప్రకంపనం

### -సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య..

**దుద్యాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య కార్యకర్తలతో కలిసి రెడ్ బుక్‌ను ప్రదర్శిస్తూ రెడ్ బుక్ ఒక ప్రకంపనం అని, ఖండాల ు దాటి చరిత్ర సృష్టించిందన్నారు. ఆస్తి ఎవరి చేతుల్లో ఉంది, శ్రమ ఎవరు చేస్తున్నారు, లాభం ఎవరు పొందుతున్నారు అనే ప్రశ్నలతో ఒక వ్యవస్థ ను విచ్ఛిన్నం చేసిందన్నారు. కార్యక్రమంలో అప్సర్, మోయిన్, ఇబ్రహీం, హ నుమంతు, అశోక్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని సరైన గాడిలో పెట్టాల్సింది సాహితీవేత్తలే

**ముషీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఎటువైపు పోతోందో తెలియని స్థితిలో ఉన్న సమాజాన్ని సరియైన దారిలో పెట్టాల్సిన బాధ్యత సాహితీవేత్తలపైనే ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం దోమల గూడలోని ఏవి కళాశాలలో తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల ప్రారంభకు సభ తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందా చారి అధ్యక్షత వహించగా, ప్రముఖ కవి, విమర్శకులు నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా వాగ్గేయకారులు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్‌లు గౌరవ అతి థులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మా ట్లాడుతూ సాహిత్యం తెలిస్తే లోకం తెలుస్తుందని, నేటి యువత సాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. నేటి



సినిమాలలో సాహిత్య ప్రాధాన్య త తగ్గిపోయి, సంగీత హోరు పెరిగిపోయిందని, వాటి మోజులోపడి, యువత గాలికి కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం ప్రారంభమయిన సాహితీ సంస్థ ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లను ఎదుర్కొని, నిలబడటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ సాహిత్య అకాడమీ చైర్మన్ ఏనుగు నర్సింహారెడ్డి, కార్యదర్శి బాలాచారి, కేంద్ర సాహిత్య యువ పురస్కా రగ్రహీత శివలింగప్ప, కళోజి అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, ప్రముఖ కవులు యాకుబ్, వువ్వా శ్రీనివాసరావు, ఎస్.రఘు, కళాశాల ప్రిన్స్‌పాల్ సి.హెచ్.రాజలింగం పాల్గొనగా, సాహితీవేత్త సలీమ వందన సమర్పణ చేశారు.

# పుష్కరిణిలో మృతదేహంపై వీడిన మిస్టరీ

### రూ.50 వేలు ఇవ్వలేదని హత్యచేసి నీళ్లలోకి తోసేసిన మహిళ : నిందితురాలి అరెస్ట్

**చేవెళ్ల, జనవరి 21, ప్రభాతవార్త:** చేవెళ్ల కేంద్రంలోని పుష్కరిణి వద్ద జరిగిన కరుణాకర్ (55) హత్య కేసును చేవెళ్ల పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. ఈ కేసులో మృతుడితో సహజీవనం చేస్తున్న బాలమణిని నిందితురాలిగా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. మృతుడు తమిళనాడుకు చెందిన కరుణాకర్ (55), ప్రస్తుతం కందవాడ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. గత ఆరేళ్ల గా కరుణాకర్, బాలమణి కలిసి ఉంటున్నారు. శివరాత్రి జాతర సందర్భంగా ఇద్దరూ కలిసి పుష్కరిణి వద్ద మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న సమయంలో డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కరుణాకర్ తన సోదరుడికి ఇచ్చిన రూ. 4 లక్షల నుండి రూ. 50 వేలు తనకు ఇవ్వాలని బాలమణి కోరగా, అతను నిరాకరించాడు.

దీంతో ఆగ్రహించిన బాలమణి అక్కడే ఉన్న కట్టెతో కరుణాకర్‌పై తీవ్రంగా దాడి చేసి పుష్కరిణిలోకి తోసేసింది. తీవ్ర గాయాలపాలైన కరుణాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలంలో లభించిన రక్తం అంటిన కర్ర, సీసీటీవీ ఫుటేజ్ క్లూస్ టీమ్ ఇచ్చిన ఆధారాల ద్వారా చేవెళ్ల పోలీసులు విచారణ జరిపి నిందితురాలు బాలమణిని అరెస్ట్ చేశారు. ఈ కేసును సీఐ భూపాల్ శ్రీధర్, డిఐ ఉపేందర్ మరియు ఎస్సై శిరీషల బృందం అత్యంత వేగంగా ఛేదించింది. నిందితురాలిని త్వరలోనే కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ వెల్లడించారు.

## స్వయం ఉపాధికి యువత ప్రయత్నించాలి



ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

**కొత్తూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీ పరిధి లోని ఇండస్ట్రియల్ జోన్‌లో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్.ఆర్.ఎస్ ట్రాన్స్పోర్ట్ సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై ఎన్ఆర్ఎస్ ట్రాన్స్పోర్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కొత్తూరు ప్రాంతంలో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుండటం ఆనంద కరమన్నారు. ఎన్.ఆర్.ఎస్ ట్రాన్స్పోర్ట్ అధినేత తుప్పర రవీందర్ వంటి యువకులు ట్రాన్స్పోర్ట్ రంగం ద్వారా ముందుకు రావడం, గొప్ప శోచనీయం అని అన్నారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించుకునేందుకు దుహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకో వాలంటే ప్రతి ఒక్కరూ ఏదో ఒక వృత్తిని ఎంచుకుని కష్టపడి పనిచేయాలని, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని ఆయన సూచించారు. ప్రాంతీయ అభివృద్ధికి పరిశ్రమలు, రవాణా రంగం కీలకమని పేర్కొన్నారు. ఎన్.ఆర్.ఎస్ ట్రాన్స్పోర్ట్ స్థాపనతో ఇండస్ట్రియల్ జోన్‌లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీకి రవీందర్ బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రోళ్ల లక్ష్మయ్య, తుప్పర గణేష్, రంజిత్, సాగర్, అనిల్, నాగేష్, శ్రీ వాస్తవ్, తదితరులు పాల్గొన్నారు.

# పరిగి సమస్యల పరిష్కారంపై స్వయంగా శ్రద్ధ పెడతా



పరిగి పురపాలక అద్యక్షురాలిగా భాద్యతలు చేపడుతున్న రజిత

**పరిగి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా , పరిగి పురపాలక సంఘ అద్యక్షురాలిగా పరిగి మున్సిపాలిటీని అన్నివిధాల అభివృద్ది చేస్తామని, స్వార్థం లేకుండా పనిచేస్తూ పరిగిలోని అన్ని వార్డులకు అన్నిరకాలుగా అభివృద్ది చేస్తామని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుదుముల రజిత తెలిపారు..శనివారం పరిగి పురపాలక అద్యక్షురాలిగా రజిత భాద్యతలు చేపట్టారు. పరిగి ఎమ్మెల్యే డా.టి రామ్మోహన్ రెడ్డి సమక్షంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ కుదుముల రజిత, వైస్ చైర్మన్ హనుమంతు లు భాద్య తలు స్వీకరించారు.. రజిత మాట్లాడుతూ పరిగి మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.. పరిగి ప్రజల సమస్యలను దగ్గరుండి నెరవేర్చే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో పీఠం దక్కించుకున్నామని, చైర్ పర్సన్ కౌన్సిలర్లు ప్రజల అభీష్టం మేరకూ పని చేయాలని సూచించారు.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పరిగి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృదే లక్ష ్యంగా పనిచేస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య ,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# 500 మార్కులు దాటితే రూ.11వేలు నగదు బహుమతి

### టెన్త్ విద్యార్థులకు జనగామ సర్పంచ్ అరుణ ప్రోత్సాహం



నూతన సర్పంచ్‌లకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

**పెద్దేముల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** విద్యార్థులు మాతృబాషపై మమకారం పెంచుకొని ఉన్నత ఫలితాలను సాధించాలని కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కే.వెంకట్ అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం మంబాపూర్ జడ్‌పిహెచ్ఎస్‌లో 11 గ్రామాల ఎస్ఎస్‌సి విద్యార్థుల, తల్లిదండ్రులతో మిషన్ ఎస్ఎస్‌సి 100 పర్సెంట్ ఫలితాలు లక్ష్యంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కె.వెంకట్ మాట్లాడుతూ పాఠశాల సర్వతో ముఖాభివృద్ధికి అందరు కలిసి కట్టుగా కృషిచేయాలని అన్నారు. మంబాపూర్ సర్పంచ్ భార్గవి మాట్లాడుతూ తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు పూర్తి సహకారం అందించాలన్నారు. జనగామ సర్పంచ్ అరుణ మాట్లాడుతూ ఎస్ఎస్‌సిలో 500పైగా మార్కులు సాధించిన వారికి రూ. 11 వేలు నగదును అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రుక్మాపూర్, రెగొండి గ్రామాల సర్పంచ్‌లు బాలరాజు, అశోక్, హెచ్ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్‌పర్సన్ పావని, మాజీ యంపిటిసి యాలటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు మోహన్, ఆనందం, సుధాకర్, శేఖర్, ఆంజనేయులు, నిర్మల, యాదమ్మ, మమత, స్వరూప, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 'నీదేం కులంరా' కు ఉత్తమ లఘుచిత్రం అవార్డు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: 'నీదేం కులంరా' లఘుచిత్రం దర్శకుడు బుడితి కోటేశ్వరరావుకు ఉత్తమ డైరక్టర్ అవార్డు లభించింది. ఘట్‌కేసర్‌కు చెందిన కోటేశ్వరరావు నీదేం కులంరా అనే లఘుచిత్రాన్ని రూపొందించగా జాతీయస్థాయి షార్ట్‌ఫిలిం విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపిక అయ్యింది. గ్లోబల్ ఇండిఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ దాశరథి థియేటర్ వారు నిర్వహించిన షార్ట్‌ఫిలింలో భాగంగా జాతీయస్థాయి తెలుగు సార్ట్‌ఫిలింలో ఉత్తమ చిత్రంగా 'నీదేం కులంరా' అనే లఘుచిత్రంను ఎంపిక చేశారు. ఈచిత్రానికి గాను ప్రముఖ డైరక్టర్ 72 సినిమాలు తీసిన రేలంగి నరసింహరావు, డైరక్టర్ చంద్రమహేశ్ ప్రేమకోసం తీసిన డైరక్టర్ వివిఎన్ ఆదిత్య మనసంతానువ్వే వన్యమ్‌రెడ్డిరాజు, డైరక్టర్ ఎంవి రఘు, డైరక్టర్ శ్రీనివాస్, టీవి నిర్మాత విజయదుర్గ, యాంకర్ వి.స్వామినాయుడు, ఫిలిం లిరిక్యాస్ట్, ఎస్.వినయ్‌కుమార్ చేతుల మీదుగా కోటేశ్వర్‌రావు అవార్డు అందుకున్నారు. ఈఅవార్డు ఫంక్షన్ శ్రీదళిత సాహిత్యవేత మాస్టర్‌జీ, శ్రీవిద్య ఫౌండేషన్-శ్రీవిద్య ఆసుపత్రి డాక్టర్ దాసారపు శ్రీనివాస్, జీవనది ఫౌండేషన్ సభ్యులు అధ్యక్షులు ఇంటి లక్ష్మి సభ్యులు హాజరై చిత్రాన్ని చూసి నటుడు, రచయిత డైరక్టర్ బుడితి కోటేశ్వరరావును అభినందించారు. సరస్వతీ నాట్యమండలి స్థాపించి దాని ద్వారా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేశామని 'ప్రేమకు సాక్షి మైసమ్మతల్లి' అనే చలనచిత్రాన్ని త్వరలో నిర్మిస్తానని వేదిపై ఈసందర్భంగా కోటేశ్వరరావు వెల్లడించారు.

# నిరంతర అధ్యయనంతో విజయం సొంతం

### -ఇన్‌కంటాక్స్ ఐటిఏటి ఉపాధ్యక్షుడు విజయ్‌పాల్‌రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త**

నిరంతర అధ్యయనంతో పాటు సబ్జెక్ట్ పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నప్పుడే జీవితంలో విజయం స్వంతం అవు తుందని హైదరాబాద్ జోన్ ఇన్కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యు నల్(ఐటిఏటి) వైస్ ప్రెసిడెంట్ విజయ్‌పాల్‌రావు అన్నారు. బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన 5వ మూట్ ట్రిబ్యునల్ పోటీల కార్యక్రమా నికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విజయ్‌పాల్‌రావు మాట్లాడుతూ సిఎ, న్యాయవాది వృత్తిలో రాణించాలంటే అదృష్టం కంటే హార్డ్‌వర్క్ ముఖ్యమని అన్నా రు. ఏదైనా విషయంపై పూర్తి పట్టు సాధించినప్పుడే, ఆయా విషయాల్లో గెలుపు సులభం అవుతుందని చెప్పారు. సీనియర్ల సలహాలు తీసుకుంటూ నిత్య విద్యార్థిలా మెదిలినపుడే వృత్తిలో నైపుణ్యం సాధించి, జీవితాంతం వృత్తిలో రాణించగ లమన్నారు. న్యాయమూర్తి ముందు వాదనలు వినిపించే సమయంలో ఎదుటి వ్యక్తి సంధించే ప్రశ్నలకు తమదైన శైలిలో విషయ పరిజ్ఞానంతో బదులు చెప్పినప్పుడే విజయం సాధించవచ్చని విజయ్‌పాల్‌రావు తెలిపారు. తెలంగాణ, ఏపి టాక్స్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సిఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ మూట్ ట్రిబ్యునల్ కాంపిటీషన్ కార్యక్రమం యువ చార్టెర్డ్ అకౌంటెంట్స్, న్యాయవాదులు తమ వృత్తి పట్ల అవగాహన పెంపొందించుకునేందుకు దోహదపడుతుందన్నా రు. ఈ కార్యక్రమానికి యువ చార్టెర్డ్ అకౌంటెంట్స్(సిఏ), న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై, మూట్ ట్రిబ్యునల్ పోటీల్లో పాల్గొని తమ తమ వృత్తిలో ఉండే విషయాలపై చర్చించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి టాక్స్ బార్ అసోసియేషన్ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఐటిఏటి హైదరాబాద్ బెంచ్ అకౌంట్ మెంబర్లు మంజునాథ జి, మధు సూధన్ సవిదా, జ్యూడిషీయల్ మెంబర్ రావిష్ సూద్ హాజర య్యారు. అలాగే మూట్ ట్రిబ్యునల్ పోటీల న్యాయ నిర్ణేతలు గా ఐటిఏటి హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షుడు డి. మన్మోహన్, ఐటిఏటి మాజీ అకౌంట్ మెంబర్ బి.రామకోటయ్య, అసోసి యేషన్ కార్యదర్శి అశిష్ జోషి, కోశాధికారి సోమశేఖర్ నెమ్మ ని, చైర్మన్ అమ్రిత్ కుమార్ కోట, కన్వీనర్ పంకజ్ సంచేటి, కో కన్వీనర్లు లీల కృష్ణమోహన్ కోట, ప్రవళిక వేముల వ్యవహరించారు.

## అమ్మ భాషను మరవద్దు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ఎన్ని భాషలు నేర్చి నా అమ్మ భాషను మరవొద్దని ప్రముఖ పాత్రికేయులు, బాల సాహిత్య కవి, రచయిత తిరునగరి వేదాంతసూరి బాలలకు ఉద్బోధించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించిన వేడుకలల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమ్మ అనే పిలుపులోనే కమ్మదనం ఉందని, ప్రతి విద్యార్థి మమ్మి, డాడి కాకుండా అమ్మ నాన్న అనే పిలుపును అలవాటు చేసుకోవాలని సూచించారు.

మన దేశంలో లేని అభిమానం పరాయి దేశంలో లభిస్తున్నదని, విదేశాల్లో మన భాష వినిపిస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలే మని, ప్రతి విద్యార్థి తెలుగు భాష పట్ల మక్కువ కలిగి ఉండా లని, మీకు తోచిన కథ కవిత వ్యాసం ఏదైనా రాసే ప్రయ త్నం చేయాలని చెప్పారు.

తాను నిర్వహించే 'మొలకొ అంత ర్జా ల పత్రిక మీ రచనలకు వేదిక అని చెప్పారు. పాఠశాల ప్రధానోధ్యాయులు భరద్వాజ మాట్లాడుతూ మాతృభాషపై మమకారం వదలవద్దని అమ్మ ప్రేమలాంటిదే మాతృభాష అని, ఆంగ్లం చేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికి మాతృ భాషను మాత్రం చులకన చేయరాదని తప్పకుండా గౌరవించా లని సూచించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు డా. కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని గొప్ప తనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యాసర చన, వక్తృత్వం, పద్య పఠన పోటీ, కథల పోటీలు కృష్ణమూ ర్తి ఆధ్వర్యంలో కొనసాగాయి.

## 26న బాలాలయ ప్రతిష్టాపన

**కొడంగల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం పునః నిర్మాణంలో భాగంగా ఈనెల 24వ తేది సాయంత్రం ప్రధాన ఆలయం మూసి వేయడం జరుగుతుందని ,అందుకుగాను భక్తుల సౌకర్యార్థం కొత్తగా ఈనెల 26న బాలాల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈనెల 23 నుండి 26 వరకు మూడు రోజుల పాటు బాలాలయ ప్రతిష్టాపనకు సంభందించి 36 మంది వేదబ్రహ్మణోత్తములచే ప్రత్యేక పూజలు కొనసాగుతాయని తెలిపారు. ఆలయంలో ప్రాణప్రతిష్టి ఇతర పూజ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఆలయం నూతన నిర్మాణం జరిగిన అనంతరం సుమారు రెండు సంవత్సరాలకు పునఃప్రారంభం కావచ్చని వారు వివరించారు.

## విగ్రహావిష్కరణ మళ్లీ వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది సీనియర్ నాయకులు జోక్యం చేసుకొని ఆవేశాలు పట్టింపులో పోకుండా సామరక్ష పూర్వకంగా సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చజెప్పడంతో సమస్య కొంత కొలిక్కి వచ్చిన విగ్రహ ఆవిష్కరణ ఏర్పాటు మునుమందు ఎలాంటి మలుపులు తిరుగుతుందో నని మహేశ్వరంలో ఉత్కంఠ కొనసాగుతుంది చివరి క్షణంలో పోలీసులు కూడా రంగ ప్రవేశం చేశారు ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన మాజీ సర్పంచులు కూన యాదయ్య స్వర్ణ గంటి నందన్ మాజీ ఎంపీటీసీలు పూతల దర్శన్ యాదవ్ తో పాటు టిఆర్ఎస్ బిజెపి కాంగ్రెస్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ జోరుల రమేష్ ఈ అంబయ్య యాదవ్ కాకిశ్వర్ ముదిరాజ్ పల్లె కుమార్ అల్లే బిక్షపతి ఎస్ సంజీవ.లాజర్ ఆగమయ్య సుభాష్ మహేందర్, భూషణ్ వనంపల్లి శ్రావణ్ కాకి పరమేష్ మల్లేష్ కే మనోహర్ కటికల శ్రీహరి. క టికల పరమేష్ చంద్రయ్య శ్రీనివాస్ దేవయ్య పి చంద్రయ్య జంగయ్య, ఎన్ సుదీర్ గౌడ్, వీరేష్, కృష్ణ, వీరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## తూంకుంట డబుల్ బెడ్‌రూమ్స్‌కాలనీకి ఆర్టీసి బస్సు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నుంచి తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీకి ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసి బస్సును మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీ ప్రజలకు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించటానికి హకీంపేట్ ఆర్టీసి డిపోకు చెందిన బస్సును ఆయన పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీ ప్రజలు ఆర్టీసి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు దీంతో ప్రజా పాలన సంక్షేమంను దృష్టిలో పెట్టుకుని సిఎం రేవంత్‌రెడ్డి పేదలకు సౌకర్యాలు కల్పిస్తున్నారని, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ల కృషితో తూంకుంటలోని డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీకి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్దులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి దీన్ని గుర్తించి రెండు ప్రత్యేక బస్సులను కాలనీ వాసులతో, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించుకోవటం జరిగిందని జైపాల్‌రెడ్డి తెలిపారు. హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ సరితకు, ఆర్టీసి ఉన్నతాధికారులకు జైపాల్‌రెడ్డి దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు బి.నాగమణి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, జి.ప్రదీప్‌కుమార్, టిఆర్ రవీందర్‌గౌడ్, ఎం.మల్లేశ్‌యాదవ్, ఎండి గౌస్‌బాబ, బి.మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు ఎస్.నర్సింగ్‌రావు, ఎం.చంద్రశేఖర్, ఆర్.అనిల్‌కుమార్, గణేశ్ నాయక్, జి.సురేశ్, జై.శివనాయక్, పి.రాము, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు రిపేర్లకు చర్యలు

**కేశంపేట ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువును శనివారం ఇరిగేషన్ శాఖ అధికారులు. గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో చెరువును పరిశీలించారు. ఈ పరిశీలనకు స్థానిక నాయకులు, రైతులు హాజరయ్యారు. శనివారం గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో రైతులు చెరువు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. చెరువులో పూడిక పెరగడం, కాల్వలు మూసుకుపోవడం, నిల్వ సామర్థం తగ్గిపోవడం వల్ల సాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కేశంపేట ఇరిగేషన్ శాఖ ఏఈ ఫాతిన చెరువును ప్రత్యక్షంగా పరిశీలించి పునరుద్ధరణకు అవసరమైన నివేదికలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వార్డు సభ్యులు నాగరాజు, మంజుల జంగేశ్, నాయకులు ముత్యాలు, సత్యనారాయణ, జానకిరాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద చెరువు పునరుద్ధరణతో రైతులకు సాగునీటి సమస్యలు పూర్తిగా పరిష్కారం కావాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎట్టకేలకు మరుగుదొడ్ల నిర్మాణం

**కేశంపేట ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రానికి వివిధ పనుల రిత్యా వచ్చే వారితో పాటు ప్రయాణికులకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతో సమస్య తీరనున్నట్లు గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం అన్నారు. శనివారం మండల తాసిల్దార్ కార్యాలయ సమీపంలో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మరుగుదొడ్లకు ఆమె భూమి పూజ నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాల నుండి మరుగుదొడ్లు లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటుండేవారు.. ఈ విషయాన్ని సర్పంచి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం పట్ల ప్రయాణికులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణంతో ప్రయాణికులకు ప్రభుత్వ కార్యాలయాలకు పని నిమిత్తం వచ్చేవారికి సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజు నాయక్, గ్రామ కార్యదర్శి విద్యావతి, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి వార్డు సభ్యులు గంజాయి దశరథం, భోగ శీను, పోలేమోని సతీష్, మంచే కృష్ణయ్య, తలసాని లత, కమ్మికర్ అనిత, తిమ్మ గళ్ళ చంద్రకళ, పులిమామిడి లత, మంగలి మహేష్, లిక్కి హంసమ్మ, మాజీ ఉప సర్పంచ్ బైరమోని బాలరాజ్ నాయకులు అమరేష్ పవన్ కుమార్ రెడ్డి వైకల్ని శేఖర్ ఆనంగారి రమేష్ ఢిల్లీ రాజు కడియాల యాదయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కోరిన కాలనీ వాసులు

**నార్సింగి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో ఉన్న కేకే-2, రంగారెడ్డి కాలనీ, గణేష్ నగర్ కాలనీలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరిం చాలని శనివారం మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేం దర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెల్లి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండాలని ఎమ్మెల్యే మమ్ములను ఆదేశించారని, నిత్యం మేము ప్రజల మధ్యనే ఉంటున్నామని తెలిపారు. పిలిస్తే పలికే నాయకుడు ఎమ్మెల్యేగా ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, అర్ధరాత్రి వెళ్లి మా ఇబ్బందులు తొలగించాలని కోరినా స్పందిస్తారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణమే ప్రకాశ్‌గౌడ్‌ను వరుసగా నాలుగుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించింద న్నారు.

# సైబర్ నేరాలపై సమరం..

-పోలీసులతో ఇన్‌ఫ్లుయెన్సర్ల జత
-జాగృత్ హైదరాబాద్ ..సురక్షిత్ హైదరాబాద్ క్యాంపెయిన్
-షార్ట్ వీడియోలతో మోసాలపై వినూత్న అవగాహన
-నవ్విస్తూనే కళ్లు తెరిపిస్తున్న కంటెంట్ క్రియేటర్లు
-సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని సిపి సజ్జనార్ పిలుపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ సిపి వీసీ సజ్జనర్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న "జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని సిపి సజ్జనర్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలతో కొలాబరేట్ చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

**ఆలోచింపజేస్తున్న వీడియోలు..**

ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇటీవల రూపొందించిన వీడియోలు ఎంతో వైవిధ్యంగా ఉండి నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లాటరీ మోసాలపై కళ్లు తెరిపిస్తూ "దేశీ మామ్ వర్సెస్ స్కామర్" కాన్సెప్ట్‌తో రూపొందిన వీడియో ప్రాక్టికల్‌గా ఆలోచింపజేస్తోంది. "మీకు రూ. 25 లక్షల లాటరీ తగిలింది.. ప్రాసెసింగ్ ఫీజు కోసం ఓటీపీ చెప్పండి" అంటూ వచ్చే ఫేక్ కాల్స్‌ను ఓ గృహిణి ఎంత చాకచక్యంగా తిప్పికొట్టిందనేది ఇందులో చూపించారు. అత్యాశకు పోకుండా, అపరిచితులతో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంచుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని బలంగా వినిపించారు.

**డిజిటల్ అరెస్ట్‌పై కనువిప్పు..**

ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల గుట్టును మరో వీడియో ద్వారా విప్పారు. సైబర్ నేరగాళ్లు సీబీఐ, పోలీస్, ఆర్బీఐ అధికారులమంటూ నకిలీ యూనిఫామ్స్ ధరించి.. వీడియో కాల్స్ ద్వారా ఏ విధంగా భయభ్రాంతులకు గురిచేస్తారో కళ్లకు కట్టారు. "భారతదేశంలో ఏ ప్రభుత్వ దర్యాప్తు సంస్థ వీడియో కాల్ ద్వారా విచారణ చేయదు" అన్న వాస్తవాన్ని ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వస్తే భయపడకుండా.. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని ఈ వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యేలా పోలీసులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సంయుక్తంగా చేస్తున్న ఈ ప్రయోగానికి నెటిజన్ల నుంచి అద్భుతమైన మద్దతు, ప్రశంసలు లభిస్తున్నాయి.

**ఫాలోయింగ్‌ను సమాజ హితం కోసం వాడండి: సిపి సజ్జనార్**

సైబర్ నేరాల కట్టడికి మరింత మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ సజ్జనం విజ్ఞప్తి చేశారు. "సామాజిక మాధ్యమాల్లో మీకు విశేషమైన ఫాలోయింగ్, గుర్తింపు ఉన్నాయి. దాన్ని సమాజ మార్పు కోసం వినియోగించండి. మీ మాటలకు ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి ఉంది. సైబర్ నేరాలపై ప్రభావవంతమైన షార్ట్ వీడియోలు రూపొందించి మీ ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్ చేయండి. సురక్షితమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణం మనందరి ఉమ్మడి బాధ్యత," అని ఆయన పిలుపునిచ్చారు.





ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రైతు బాడీ అగ్రి షో 2026 యొక్క 3వ ఎడిషన్‌ను సందర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

## వైద్యుల నిర్లక్ష్యానికి.. పసిబాలుడు మృతి

-కుటుంబ సభ్యుల్లో నింపిన విషాదం



శిశువు మృత దేహంతో ఏడుస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

**అత్తాపూర్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** వైద్యుల నిర్లక్ష్యానికి వైద్యం వికటించి ఆరు నెలల శిశువు మృతి చెందిన విషాద ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... బండ్లగూడ జాగీర్ పరిధిలోని వికాస్ నగర్‌లో ఉండే విష్ణువర్ధన్‌రెడ్డి, అశ్వినీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, మూడో సంతానంగా ఆరు నెలల కుమారుడు ఉన్నారు. శనివారం కుమారుడికి జ్వరం రావడంతో స్థానిక క్రేయాన్స్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్‌కు తీసుకువెళ్లగా వైద్యుడు అభిషేక్, సిబ్బంది బాలుడు రామును పరిశీలించి గడువు ముగిసిన ఇంజక్షన్ ఇచ్చారు. అది వికటించింది. కొద్దిసెప్పటికే బాలుడు చూస్తుండగానే తల్లి ఒడిలో ప్రాణాలు వదిలాడు. గుండె ఎక్కువ వేగంతో కొట్టుకోవటం కోసం ఇచ్చే ఇంజక్షన్ వేశారు. ఆ మందు ప్రభావం తట్టుకోలేక ప్రాణాలు విడిచాడు. ఉన్న ఒక్కగానొక్క వంశాంకురం డాక్టర్ల నిర్లక్ష్యానికి బాలికావటం ఆకుటుంబాన్ని తీవ్రంగా కలిచి వేసింది. తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయ్యారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధిత బంధువులు, స్థానికులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హాస్పిటల్‌పై కేసు నమోదు చేస్తున్నారు.

## ఇంటి యజమాన్ని బాధలను భరించలేక గృహిణి ఆత్మహత్య

**అల్వాల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ఇంటి యజమాని బాదలను భరించలేని గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హస్మత్‌పేట్ అబ్రహార్ మస్జిద్ సమీపంలో షేక్ సాబేర్ తనభార్య తబాసుమ్(42) నలుగురు సంతానంతో నివాసం ఉంటున్నాడు. రెండు రోజులు క్రితం ఇరవై ఏళ్ళుగా అద్దెకు ఉంటన్న ఇంటిని ఖాళీ చేసి సమీపంలోని మాల బస్తీకి వెళ్ళడం జరిగింది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 3 గంటలు సమయంలో తబాసుమ్ పాత ఇంటిలో మిగిలి ఉన్న బట్టలు ఇతర సామగ్రి తీసుకోవడానికి వెళ్ళింది. అక్కడి నుంచి భర్త షేక్ సాబేర్‌కు ఓ వాట్సప్ మెసెజ్ చేసింది. ఇంటి యజమాని తనను మానసికంగా హింసిస్తున్నాడని, అడ్వాన్స్ తిరిగి ఇవ్వక పోగా మోటార్ ఇతర వస్తువులు పాడైనట్లు చెబుతున్నట్లు తెలిపింది. తన అనుమతి లేకుండా పలుమార్లు ఇంటి లోపలకి వచ్చి ఇబ్బందులకు గురి చేసే వాడని పేర్కొంది. ఐదున్నర గంటలు సమయంలో భార్య కోసం పాత ఇంటికి వచ్చి చూసే సరికి భార్య వంట గదిలో ఉరి వేసుకుని ఉంది. షేక్ సాబేర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

-అధికారులను ఆదేశించిన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్ ఫిబ్రవరి 21 ( ప్రభాతవార్త) :** మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎం.ఎం.సి) పరిధిలో చేపట్టిన ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు హెచ్‌సిటీ , ఎస్.ఎన్.డి.పి ) పనుల పురోగతిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పనుల స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెచ్‌సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ) ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 4 కీలక ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ఏఓసీ సెంటర్ ఫ్లైఓవర్, రోడ్ ఓవర్ బ్రిడ్జి లైన ఆర్.కె పురం , ఆర్.కె పురం , టీకేఆర్ కమాన్ నుండి మంద మల్లమ్మ వరకు ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం ఎస్.ఎన్.డి.పి పనులపై సమీక్షిస్తూ మొత్తం 9 కొత్త నాలాల పనులలో ఇప్పటికే 6 నాలాల పనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన 3 నాలాల పనులను తక్షణమే వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే నాలాల పూడికతీత పనులన్నీ పూర్తి చేయాలని, తద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు

న-పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి




కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి ఇతర అధికారులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వీడియో గేమ్‌ల ద్వారా కూడా సైబర్ క్రైంలు పెరిగిపోయాని, పిల్లలు ఇష్టానుసారంగా గేమ్‌లు ఆడుతూ బలవుతున్నారని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జామియా ఉస్మానియా వద్ద గల ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో భారీ సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమే మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్‌లో క్యాండీ క్రష్ వంటి ఆటలు ఆడుతుండగా, ఒక లెవల్ నుండి మరో లెవల్‌కి వెళ్ళినప్పుడు ఫ్రీ గిఫ్ట్ ఆఫర్‌లు వస్తుంటాయని, ఆ లింకులను నొక్కినప్పుడు అవి మనల్ని ప్రమాదకరమైన పేజీలకు తీసుకెళ్లి, అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేసేలా ప్రోత్సహిస్తాయి" అని ఆమె హెచ్చరించారు. ఇలాంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ రవీందర్ గౌడ్, సెక్టర్ ఎస్సై రామచంద్రారెడ్డి, సికింద్రాబాద్ జోన్ మహిళా ఎస్సై మేఘన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు కూరగాయ పంటల సాగుకు మొగ్గు చూపాలి

**అత్తాపూర్ ఫిబ్రవరి21,ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూరగాయల కోరత 50శాతంపైగానే ఉందని అందుకే పలు ఇతర రాష్ట్రాలైన కర్ణాటక ,మహారాష్ట్ర,చత్తీస్‌గడ్,ఆంధ్రప్రదేశ్,తమిళనాడు రాష్ట్రం నుంచి పలు కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నామని దీన్ని అధికమించేందుకు రైతులు కాయగూరల సాగు చేయాలని తద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చునని ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు.రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న కూరగాయల పంటలపై అఖిలభారత సమన్వయ పథకం 44వ వార్షిక సమావేశం రెండవ రోజు కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా హాజరైన ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడారు...కూరగాయ పంట్లో ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన సాంకేతిక సలహాలు,సూక్ష్మ సేద్య పరికరాలు మిషనరీ సబ్సిడిపై అందిస్తామని,అధిక దిగుబడినిచ్చే రకాలు సిఫార్సు చేస్తామని అన్నారు.మిగతా పంటలతో పోలిస్తే కూరగాయల పంట్లో తక్కువ కాలంలో దిగుబడి సాధ్యమని తద్వారా మేలైన ధరతో సాగు రైతులకు గిట్టుబాటు అవుతుందని అన్నారు.అధిక వేడిని తట్టుకునే రకాలు,ముడత రోగం తట్టుకునే రకాలు,వైరస్‌ను తట్టుకునే రకాలు,ఎండు తెగులు తట్టుకోవడంతో పాటు అధిక నాణ్యత కలిగిన రకాలు రాష్ట్రంలో సాగుకు అవసరమని ఆమె అన్నారు. సాధ్యమైనంత ఎక్కువ రైతు క్షేత్రాల్లో నూతన రకాలు, ఉత్తమ పద్ధతులను ప్రదర్శించి రైతులకు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, ఐ సి ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే, వారణాసిలోని భారతీయ కూరగాయల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ కుమార్, బెంగళూరులోని ఐ హెచ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ టికె బెహరా, అని ఎన్‌బిపిజిఆర్ డైరెక్టర్ డాక్టర్ జిపి సింగ్, మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ల్నవడి, ఎన్ ఐ ఆర్ సి ఏ రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ శేషు మాధవ్, పరిశోధన సంచాలకులు లక్ష్మీనారాయణ, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనిత కుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ పి ప్రశాంత్, దేశవ్యాప్తంగా కూరగాయల్లో పరిశోధన చేస్తున్న 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ సర్వే వేగంగా చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



ఓటర్ల మ్యాపింగ్ సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ముందస్తు సన్నాహాల్లో భాగంగా హైదరాబాద్‌లో చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ సర్వేమరింత చురుగ్గా, వేగంగా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలను ఆదేశించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తో కలిసి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్ పోలింగ్ కేంద్రం 211 పరిధిలో ఓటరు జాబితాసవరణ చేపట్టిన ప్రోజెన్సీ మ్యాంపింగ్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం చార్మినార్ నియోజకవర్గంలోనిలో కబుత్తరుఖానా పోలింగ్ కేంద్రం 12 పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్‌లతో మాట్లాడారు.మ్యాపింగ్ ఎట్లా చేస్తున్నారంటూ ప్రశ్నించారు. మ్యాపింగ్ పై వారికి ఉన్న అవగాహన ను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి.. 2002 జాబితాలోని ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలను 2025 జాబితాను పోల్చుతున్నామని తెలిపారు. 2002 జాబితాలో పేర్లున్న ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి... ప్రస్తుత జాబితాలో ఉంటే వారి పేర్లను మ్యాపింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన ప్రోజెన్సీ మ్యాంపింగ్ పురోగతిని ఈఆర్‌వోలు ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రోజెన్సీ మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రోజెన్సీ మ్యాపింగ్ చురుగ్గా చేపట్టి వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల జాబితాల్లో కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టనుందని తెలిపారు. క్షేత్ర పరిశీలనలో ప్రధాన ఎన్నికల అధికారి వెంట అదనపు కమిషనర్ ( ఎన్నికల విభాగం ) చంద్రకళ, సరిత, ఆంజనేయులు, సుధీర్ రెడ్డి, ఎన్నికల విభాగం సహాయ మున్సిపల్ కమిషనర్ విమల తదితరులు ఉన్నారు.

## ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే జ్ఞానసంపద పెంచుకోవాలి

-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి




**హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త:** ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులు నిరంతర జ్ఞానసంపద పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరి అన్నారు.శనివారం అబిడ్స్‌లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆలోచనా దినోత్సవం (వరల్డ్ థింకింగ్ డే) సందర్భంగా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న స్కౌట్ ఉద్యమం స్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బాడెన్ పోవెల్ జన్మదినం రోజును ప్రపంచ ఆలోచన దినోత్సవంగా జరుపుకోబడుతుందని కలెక్టర్ వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మానవ జీవనశైలిలో ఆలోచన అత్యవసరమైన నైపుణ్యమని తెలుపుతూ చదువుతో పాటూ, శారీరక, మానసిక, సామాజిక సర్వతో ముఖాభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు నిరంతర జ్ఞానసంపద, విశ్లేషణ, ప్రశ్నించే తత్వం ముఖ్యమని అన్నారు. క్రమశిక్షణ, నాయకత్వం, ఐక్యత, సమాజసేవ వంటి విలువలను పెంచేదిశగా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. అలాగే కొత్త ఆలోచనలు , ఆవిష్కరణల ద్వారా జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రేపటి భవిష్యత్ పునాదులు కాబట్టి చురుకైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలని, తద్వారా ఇంట్లో, పాఠశాలలో , సమాజంలో తమ చుట్టూ ఉన్న పరిస్థితులను ఎలా మెరుగుపరచవచ్చో ఆలోచించాలని ఆమె విద్యార్థులను సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు మెమెంటోలు అందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్ , స్కౌట్ మాస్టర్ రాములు నాయక్, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, స్కౌట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కోకరివాడి,షక్కర్‌కోటలో అధ్వానంగా రోడ్లు



కోకరి వాడిలో చెడి పోయిన రోడ్డు

**చార్మినార్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పాతబస్తీ ఘాన్సీబజార్ డివిజన్ పరిధిలోని కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలలో రహదారులు చెడి పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.చెడి పోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టనందున ప్రజలు నరక యాతనకు గురివుతున్నారు. వస్త్రాలు, బంగారం ఆభరణాల విక్రయాలకు ప్రసిద్ధి గాంచిన కోకరివాడి,షక్కర్‌కోటకు ప్రతీ రోజు ప్రజలు వస్తుంటారు.అసలే ఇక్కడ రహదారులు వెడల్పు దీనికి తోడు రోడ్లు గుంతలు మయంగా మారటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లిస్తున్న జిహెచ్‌ఎంసి అధికారులు మాత్రం రహదారులకు మరమ్మతులు చేపట్టక పోవటం పట్ల స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.బండిఅడ్డ నుంచి షక్కర్‌కోట,కోకరవాడి ప్రాంతాలకు రాత్రి వేళల్లో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే వెనుకంజు వేస్తున్నారు.రహదారిలో రాళ్లు తేలి ఉన్నందున వాహనదారులు అదుపు తప్పి వాహనాలను అదుపు చేయలేక కింద పడిపోతున్నారు.సంవత్సరం నుంచి కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలలో చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు ప్రజలు మొరపెట్టుకున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఘాన్సీబజార్‌లోని కోకరివాడి, షక్కర్‌కోటలోని రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అపార్ట్‌మెంట్ చోరీ కేసును ఛేదించిన బేగంపేట పోలీసులు

-ఇద్దరు నిందితుల అరెస్ట్...రూ40లక్షల విలువైన బంగారం,60వేల నగదు,మొబైల్‌ఫోన్లు స్వాధీనం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి




స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

**బేగంపేట ఫిబ్రవరి 21,ప్రభాతవార్త** బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్‌లోని సత్యకృష్ణ సిరి సంపద అపార్ట్‌మెంట్ 302 ఫ్లాట్ లో జరిగిన చోరీ కేసును బేగంపేట పోలీసులు ఛేదించారు.ఈ కేసులో నిందితులైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు,235 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మొబైల్ ఫోన్లు,రూ 65వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై శనివారం బేగంపేట పోలీసుస్టేషన్ లో ఏసీపీ గోపాల కృష్ణ మూర్తి విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేసారు.బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ సత్యకృష్ణ సిరి సంపద అపార్ట్‌మెంట్ 302 ఫ్లాట్ లో ఎం.అనురాధ విజేంద్రనాథ్ అనే మహిళ ఒంటరిగా నివసిస్తుందన్నారు.ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం ఆమె కవాడీ గూడా లో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు వెళ్లిందన్నారు.16ఉదయం ఆమె ఇంట్లో పనిచేసేందుకు వచ్చిన పనిమనిషి ఇంట్లో తాళాలు పగుల గొట్టి ఉండటం చూసి అనురాధకు సమాచారం ఇచ్చిందన్నారు.వెంటనే ఆమె ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని సుమారు 40తులాల బంగారు ఆభరణాలు,వెండి,రూ 60వేల రూపాయల నగదు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారన్నారు.21వ తేదీన ఇద్దరు నిందితులు సికింద్రాబాద్ రేతిఫిల్ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న బేగంపేట ప్రకాష్ నగర్‌లో శివపార్వతి బాయ్స్ హాస్టల్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లా వరక కవిటి బోరివంక కు చెందిన బి.ప్రదీప్ (25) ,షేక్ పేట కు చెందిన ఎడ్ల ప్రవీణ్ కుమార్(32), అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసిన విషయాన్ని వెల్లడించారన్నారు.వారి వద్ద నుంచి 235గ్రాముల బంగారు ఆభరణాలు ,రెండు మొబైల్స్,రూ65000లు నగదు మొత్తం రూ40,00,000లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ వెల్లడించారు.నిందితులు సీసీ కెమెరాలు లేని అపార్ట్‌మెంట్ ను గుర్తించి ఈ దొంగ తనానికి పాల్పడ్డారన్నారు.వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ బేగంపేట పరిధిలో నివసించే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు,మెయిన్ డోర్ కు సెంట్రల్ లాకింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రయాణాల వివరాలను సోషల్ మీడియాలో ఎప్పుడూ పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. నేరస్థులను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు, కంటోన్మెంట్ టీం ఇన్స్‌పెక్టర్ నరసింహరావు, కె.సచ్చదానందం,ఎస్సై శ్రావణ్ కుమార్,బేగంపేట క్రైం సిబ్బంది ని ఏసీపీ అభినందించారు.ఈ సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి తో పాటు ఇన్స్‌పెక్టర్ సైదులు ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

## వెల్‌చాల్‌లో రూ.16 లక్షలతో పిహెచ్‌సి భవనం

**మోమిన్‌పేట్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులకు తెలంగాణ ప్రభుత్వం, శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వెల్‌చాల్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండలం వెల్‌చాల్ గ్రామంలో నూతనంగా 16 లక్షల రూపాయల వ్యయంతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి నివేదిక పంపినట్లు తెలిపారు. అదే విధంగా వేసవి కాలంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తుగా గ్రామంలోని బోరు బావులలో నూతన మోటర్లు అమర్చడం జరిగిందని తెలిపారు. అనంతరం సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించి గ్రామంలోని ప్రాథమిక సమస్యలపై చర్చించి పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలపై చర్చించి, గ్రామంలో ఇంటి పన్నులు వార్డుల వారిగా సభ్యుల సహకారంతో వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. వార్డు సభ్యుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి దిశగా అడుగులు వేసి అభివృద్ధి కొరకు పాటు పడాలని సర్పంచ్ శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ అభిషేక్ తివారి, క్యాసి అధికారి విజయ్, సిబ్బంది వెంకటేశం, ఉపసర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీజీఐ సంస్థ ప్రతినిధికి సేంద్రీయ ఎరువుల ప్యాకెట్‌ను చూపిస్తున్న మహిళా రైతు

## మహిళారైతుల కోసం డైరీ ఫాం

**కొడంగల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మహిళ రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేందుకు సీజీఐ సంస్థ ప్రోత్సహిస్తుందని సంస్థ ప్రతినిధులు కిరణ్‌కుమార్ గోపాల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ప్యాలమద్ది గ్రామ శివారులోని రైతు సేవల ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయంలో 300 మంది రైతులు సేంద్రీయ ఎరువులతో వ్యవసాయ చేస్తున్న తీరును వారు పరిశీలించారు. సేంద్రీయ ఎరువులతో మహిళ రైతులు పండించిన 18 రకాల పంటల ఉత్పత్తులను సంస్థ ప్రతినిధులు పరిశీలించి మహిళ రైతులను ప్రోత్సహించారు. వివిధ రకాల ఎరువులు వాడకం వల్ల పంటల దిగుబడి ప్రజలపై ప్రభావం ఏవిధంగా ఉంటుందనే అంశాలను సభ్యులు తెలిపారు. సేంద్రీయ ఎరువులతో ప్రతి మహిళ రైతులు వారికి ఉన్న ఎకరం పొలంలో పంటలను సాగు చేసేందుకు ముందుకు వచ్చారని సంఘం చైర్మేన్ నాగమ్మ తెలిపారు. మహిళ రైతుల ప్రోత్సహం చూసి తెలంగాణా గ్రామీణ బ్యాంకు వారు డైరీ ఫాం ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు సంస్థ జనరల్ మేనేజర్ మహ్మద్ వసీం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 23 నుంచి పంచాయతీ చట్టంపై శిక్షణ

**కందుకూరు ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన కల్పించడానికి ఈనెల 23వ తేదీ నుండి మార్చ్ 20వ తేదీ వరకు శిక్షణా తరగతుల కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు కందుకూరు ఎంపీడీవో సరిత తెలిపారు మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీలను మూడు బ్యాచులుగా ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు సంబంధించిన వార్డు మెంబర్లకు మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఐదు రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. మొదటి విడత ఈనెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు మండల పరిధిలోని అగర్మియాగూడ, ఆకుల మైలారం, అన్నోజిగూడ, బాచుపల్లి, బైరాగుడ, బేగరి కంచ, బేగంపేట్, చిప్పలపల్లి, దెబ్బడగూడ, దాసర్లపల్లి, దాసర్లపల్లి తండా, దావూద్ గూడ తండా గ్రామాలకు సంబంధించి వంద మంది వార్డు సభ్యులకు ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు అదేవిధంగా రెండవ విడత మార్చు 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు, మూడవ బ్యాచి వారికి 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.



స్వయం పరిపాల దినోత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పట్టణంలోని క్రిస్టియన్ కాలనీ 16 వ వార్డులో చిన్న కుంటబడి ప్రభుత్వ పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి క్ర్ర కిషోర్ ముఖ్య అతిథిగా హాజరై బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకి ఇంకా మౌలిక సదుపాయాలు పెంచాలని కోరారు

## వ్యాపారరంగంలో వృద్ధి చెందాలి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఓ షాప్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో ముందుకు వచ్చి స్వయం ఉపాధి సాధించి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షి ంచారు. వ్యాపారంలో నిబద్ధత, నాణ్యత, నమ్మకం ఉంటే తప్పకుండా విజయాలు సాధించవచ్చని సూచించారు. వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్,

# ఎండైనా..వానైనా..ఆరుబయటే

- మండలకేంద్రంలో కనీసం బస్సు షెల్టరూ లేదు
- బస్సుల కోసం రోడ్డు పక్కన నిరీక్షణ
- కనీసం కూర్చునే బెంచీలు లేక వృద్ధుల అవస్థ
- ఎమ్మెల్యే దృష్టి సారించాలని స్థానికుల విజ్ఞప్తి

**కొత్తూరు ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** కొత్తూరు మున్సిపల్ కేంద్రంలో బస్ స్టేషన్, సులభ్ కాంప్లెక్స్ వంటి ప్రాథమిక సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ వందలాది మంది బస్సుల కోసం రోడ్డుపక్కనే నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నీడ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూర్చోవడానికి బెంచీలు లేకపోవడం, తాగునీటి సదుపాయం లేకపోవడం, శౌచాలయాల లేమి సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తోంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. అదే విధంగా కొత్తూరు మున్సిపల్ కేంద్రంలోని బస్టాండ్ సమస్యపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, ప్రయాణికులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



బస్సు కోసం ఎండలో నిలబడి ఉన్న ప్రయాణికులు

**కనీసం తాత్కాలిక షెడ్ అయినా నిర్మించండి**

రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక షెడ్ ఏర్పాటు, తాగునీటి సదుపాయం, శౌచాలయాల నిర్మాణం వంటి చర్యలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. శాశ్వత బస్ స్టేషన్ నిర్మాణానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి చర్యలు తీసుకుంటే ప్రయాణి కులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని స్థానికులు భావిస్తున్నారు.

## గాంధీ సిద్ధాంతాలకు రేవంత్ సర్కార్ తిలోదకం

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజం

**మహేశ్వరం, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానం ప్రసాదించుబాపు అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండలం దిల్వార్‌గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాత్మా గాంధీ కన్న కలలు, ఆశయాలను ఆచరించినప్పుడే దేశం సుభిక్షంగా, శాంతి యుతంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. గాంధీజీ సిద్ధాంతాలకు విరుద్ధంగా నేటి తెలంగాణలో పాలన సాగుతోందని ఆమె విమర్శించారు. మహనీయుల ఆశయాలను తుంగలో తొక్కుతూ, హింసను ప్రేరేపించే విధానాలతో, అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తున్నదని ఆరోపించారు. ఓ బాపూ నువ్వైనా చెప్పు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి అని వేడుకున్నారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడి

## షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి చేస్తా

**ఆమనగల్లు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో తలెత్తిన సమస్యపై మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ ప్రత్యేకంగా ఆరా తీశారు. చిరువ్యాపారుల సంఘం ప్రతినిధులు అధ్యక్షులు గాజుల శ్రీను, ఉపాధ్యక్షులు రూపం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసం నరేందర్‌లను శుక్రవారం మర్యాదపూర్వకంగా తన వద్దకు ఆహ్వానించి ఉత్పన్నమైన సమస్యపై ఆరా తీశారు. ఆమనగల్లు పట్టణంలోని వాణిజ్య కేంద్రం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఉండడం పట్టణంలో దుకాణాల కొరత ఏర్పడడం, ఉన్న వాటికి అద్దెలు కొండంత ఉండడంతో దశాబ్దాల తరబడిగా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుపై డిమాండ్ అధికంగా ఉందని వారు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. కాగా గతంలో తీసుకున్న చర్యలు, కోర్టులో కేసు వివరాలపై ఆరా తీశారు. సమస్యకు పరిష్కారం చూపి త్వరలోనే నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎంపి మల్లురవిలతో కలుస్తానని ఆయన హామి ఇచ్చారు. కార్యక్రమంలో గణేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.



మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్‌కు సన్మానిస్తున్న చిరువ్యాపారుల సంఘం ప్రతినిధులు

## పోచారం డివిజన్‌ను రెండుగా విభజించాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** పోచారం డివిజన్‌ను ప్రజలకు పరిపాలన సత్వరమే అందే విధంగా రెండుగా విభజించాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి శనివారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. పోచారం డివిజన్ 8లో నెలకొన్న పలు సమస్యలను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్‌ను మాజీ మున్సిపల్ చైర్మన్ కలిసి పరిష్కరించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. పోచారం డివిజన్‌ను రెండు డివిజన్‌లు విభజించడంతో పాటు అన్నోజిగూడలోని డంపింగ్‌యార్డును తరలించాలని, చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, ప్రతాప సింగారం, కొర్రెముల గ్రామాల్లోని వైకుంఠధామాలను అభివృద్ధి చేయాలని కోరారు. డివిజన్ పరిధిలోని తాగునీటి పైపుల లీకేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. డివిజన్ పరిధిలోని పార్కుల స్థలాల రక్షణ, వాటి నిర్వహణ చేపట్టాలని కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.



కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి

## పట్టణ సుందరీకరణకు సలహాలివ్వండి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఘన విజయం సాధించిన మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన అగ్గనూరు బసవం, వైస్ చైర్మన్ అందే మోహన్, రెండో వార్డ్ కౌన్సిలర్ బచ్చలి నరేష్, 25 వార్డు కౌన్సిలర్ పెంటయ్య షాద్ నగర్ పెన్షనర్స్ సంఘ భవనంలో రామారావు అధ్యక్షతన పెన్షనర్స్ సంఘ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షరాబు జగదీశ్వర్ జిల్లా అధ్యక్షులు, సత్య నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి, నందిగామ సురేష్ కుమార్ షాద్నగర్ ప్రధాన కార్యదర్శి, సుధాకర్ రెడ్డి కోశాధికారి, కార్యవర్గ సభ్యులు మూలే జనార్ధన్, బిశ్వ కృష్ణయ్య, మందారం నరసింహులు, ఈశ్వరయ్య, రంగరాజన్ కుమార్, వెంకటరమణ, శ్యామల, విజయలక్ష్మి శ్రీ, గోపాలరావు స్వరాజ్ బాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్నీ విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అగ్గనూరు బసం, అందే మోహన్ మాట్లాడుతూ పెన్షనర్స్ దీవెనలు ఉండాలని, షాద్ నగర్ పట్టణాన్ని మీ యొక్క సలహాలు సూచనలు తో ఇంకా సుందరంగా తీర్చిదిద్దుతామని, సభాముఖంగా తెలుపడం జరిగింది, అలాగే ఏ సమస్య ఉన్న పెన్షనర్స్ ఒక ఫోన్ కాల్ చేస్తే ఆ సమస్య పరిష్కరించడంలో ముందు ఉంటామని సభికుల హర్షధ్వనాల మధ్య ప్రకటించడం జరిగింది.



పెన్షనర్స్ సంఘం సభ్యులతో మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్

## విద్యార్థులకు చలి దుప్పట్ల పంపిణీ

**షాద్‌నగర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పోరుమామిళ్ల లోని శాంతి ప్రేమ సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి టీ. శ్రీను ఫరూఖ్ నగర్ లోని జెడ్.పి.హెచ్.ఎస్. హై స్కూల్ మారియు ప్రాథమిక పాఠశాల లో చదువుతున్న 550 బాల బాలికలకు ఉచితంగా చలి దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పేద పిల్లలకు సహాయ సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచితంగా చలి దుప్పట్ల పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాగా చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనము అన్ని రంగాల్లో రాణించగలమని కావున పరిశుభ్రతను పాటించాలని తెలియజేశారు. ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ సహకారాలు మా పాఠశాలకు అందజేయాలని కోరుచున్నాము అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు ఉపాధ్యాయులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.





విద్యార్థులకు దుప్పట్లను అందజేస్తున్న దృశ్యం



ఏయూలో హ్యాకతాన్ కోడ్‌ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న వంశీకృష్ణ

## సాంకేతిక మెళుకువలకు హ్యాక్‌తాన్ దోహదం

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** విద్యార్థుల సృజనాత్మకత ప్రదర్శనకు, సాంకేతికనైపుణ్యం పెంపుదలకు హ్యాక్‌తాన్‌లు ఉపయోగపడుతాయని డైరెక్టర్ ఆఫ్ అప్లికేషన్స్ ఇంజనీరింగ్ సినాప్సిన్ వంశీకృష్ణ అన్నారు. వెంకటాపూర్ ఏయూ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే 36 గంటల హ్యాక్‌ట్రానిక్స్ 2.0 హ్యాకతాన్ కోడ్ ఫెస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పలువురు వక్తలు మాట్లాడుతూ నాలుగు విభాగాల్లో హ్యాక్‌తాన్ నిర్వహించడం తెలంగాణలోనే మొదటిదిగా అభివర్ణిస్తూ ఈసీ విభాగాన్ని అభినందించారు. హ్యాకతాన్‌కు రక్షణరంగ సంస్థలు, పరిశ్రమల్లో మెలకువలు విద్యార్థులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. విఎల్ఎస్ఐ, ఏఐఓటి, రోబోటిక్స్ మరియు ట్రాక్‌సాట్ విభాగాల్లో నిర్వహిస్తుండగా ఆయా కళాశాలలకు చెందిన దాదాపు 400 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ జయ సక్సేనా, ఆర్‌సీఐ డైరెక్టర్ టెక్నాలజీ మల్లిఖార్జునరావు,యాకర గణేశ్, తేజేస్ కుమార్, ఐశ్వర్యచౌదరి, ఎం. సతీశ్, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ హరికృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ ఎం. నారాయణ, కో కన్వీర్లుగా ఎ. రాధిక, సీఎస్ఈ డీన్ జి. విష్ణుమూర్తి, కె. శ్రీనివాస చలపతి, అసోసియేట్ డీన్ ఎస్ఓఈ హ్యాకతాన్ కో ఆర్డినేటర్లు జి. రేణుక, ఎల్, ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తిపరమైన విలువలతో విజయాలు సాధిస్తారు

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** విజయం సాధించడానికి వృత్తిపరమైన విలువలు పెంపొందించుకుంటేనే రాణించాగల్గుతామని టాటా కన్సల్టెన్సి సర్వీసెస్ ట్రైనింగ్ డివిజన్ హెడ్ జెవిఆర్ఎస్. ప్రసాద్ అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లి దివ్యానగర్ నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్ ప్రారంభోత్సవం జరిగింది. ఎంబిఏ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించడం దానికి అనుగుణంగా లాజికల్ థింకింగ్ అలవర్చుకోవాలని అన్నారు. ఈ సదస్సుకు దాదాపు 92 కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి సంధ్యావళి, కళాశాల డైరెక్టర్ దివ్యనల్ల, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు డాక్టర్ స్నేహ నల్ల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎంఎన్.వి. రమేశ్, ఆయా విభాగాలకు చెందిన హెడ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టెక్‌ఫెస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన టాటా కన్సల్టెన్సి డివిజన్ హెడ్ ప్రసాద్

## లక్ష్మీదేవునిపల్లి గుడికి రూ.లక్షన్నర విరాళం

**షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** లక్ష్మీ మ్మదేవుని పల్లి గ్రామంలో ఘనంగా నిర్మాణం జరుగుతున్న గణపతి, అభయ ఆంజనేయ, శివాలయం, రామాలయం, నవగ్రహాల ప్రతి ష్ఠ మహోత్సవం సందర్భంగా దేవాలయ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతూ దిలీప్ శర్మ రూ.లక్షన్నర మహా విరాళంగా అందజేశారు. గ్రామ ఆధ్యాత్మిక చరిత్రలో నిలిచి పోయే విధంగా అందించిన ఈ విరాళం ఆలయ నిర్మాణ పనులు, గోపుర నిర్మాణం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, మహోత్సవ ఏర్పాట్లకు ఎంతో బలాన్నిచ్చేలా ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ సేవ అనేది దైవ సేవతో సమానం. ఇంత పెద్ద మొత్తంలో విరాళం అందించి గ్రామ ఆధ్యాత్మిక వికాసానికి చేయూతనివ్వడం అత్యంత ప్రశంసనీయం" అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. దిలీప్ శర్మ సేవాభావం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తుందని, భవిష్యత్తులో కూడా ఆయనకు దైవ కృప లభించాలని ఆకాంక్షి స్తూ ఆలయ కమిటీ, గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీ మ్మదేవుని పల్లి గుడి నిర్మాణంలో ఇది ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



విరాళం అందజేస్తున్న దిలీప్‌శం

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే శంకర్

**కొందుర్గు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసనసభ్యులు కే.శంకరయ్య అన్నారు. శనివారం నాడు ఆయన మండల పరిధి లోని అయోధ్య పూర్ తండా, చిన్న ఎల్కిచర్ల, ఉత్తరాస్ పల్లి, ముట్పూర్, కొందుర్గు, రేగడి చిలుక మరి, ఆగిరాల ఆగిరాల, విశ్వనాధ్పూర్ గ్రామాలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సిసి రోడ్లు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు గోపాల్ నాయక్, పత్తి శ్రీశైలం, కనకమామిడి అంజయ్య, ఏ చంద్రశేఖర్ రెడ్డి, చౌదాపురం ప్రభాకర్, శ్రీలత రాములుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**కేశంపేట ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని పాపిరెడ్డి గూడా సర్పంచ్ శశిరేఖ యాదయ్య అన్నారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో కోళ్ల అమృతమ్మకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు సర్పంచ్ శశిరేక యాదయ్య భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చేవెళ్ల నర్సింలు, రాఘవేందర్, వార్డు మెంబెర్ సురేష్,శివానంద్,ప్రవీణ్, రవి, యాదయ్య, బాలయ్య, గ్రామస్తులు కాంగ్రెస్



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు



పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రశాంత్

## పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి భూమి పూజ

**కొడంగల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం పనులకు కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, గ్రామ సర్పంచ్ పద్మమ్మ భూమిపూజ చేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో విద్యారంగానికి సంభందించి ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పూర్తి చేసేందుకు సహకరిస్తామని హమీ ఇచ్చారు. అలాగే ఎస్సీ కాలనీలో పాఠశాల భవనానికి వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూర్పు భీములు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చింతలపల్లిలో గడ్డివాము దగ్ధం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో కొప్పు లక్ష్మయ్యకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. తగలబడిన గడ్డి విలువ దాదాపు రూ.30వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కొప్పు యాదయ్య ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్ళి పాలు సేకరించి తిరిగి ఇంటికి చేరుకున్నానని, తిరిగి 10 గంటల ప్రాంతంలో పొలం వద్దకు వెళ్ళగా తగలబడిన గడ్డివాము కనిపించిందని బాధితుడు లక్ష్మయ్య సర్పంచుకు వివరించారు. ఈమేరకు తహశీల్దార్ డిప్యూటి తహశీల్దార్ వినోద్‌కు ప్రమాద ఘటనను వివరిస్తూ ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సర్పంచు సమక్షంలో బాధితుడు వినతిపత్రం అందజేశారు.



డీటి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

## మాతృభాషతోనే మనోవికాసం

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** మాతృభాషలో విద్యను అభ్యసించడం వల్ల విద్యార్థుల్లో మనోవికాసం పెంపొందుతుందని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డా. కె. సురేశ్ అన్నారు. బుధవారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కె. సురేశ్ మాట్లాడుతూ..మాతృభాషలో బోధన వల్ల శాస్త్ర విజ్ఞానం సులభంగా అర్థమవుతుందన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నతల్లి వంటి మాతృభాషను మరువకూడదని విద్యార్థులకు సూచించారు. డా. చింతల రాకేశ్ భవాని సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. రమేశ్, సురేశ్, హృదయ రాజు, డా. మాధవి, రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేశ్

## అనుచిత పోస్టులు పెడితే చర్యలు

**తలకొండపల్లి, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తలకొండపల్లి ఎస్సై ఎ.శ్రీకాంత్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ, కుల, మత, ప్రాంతీయ వివాదాలకు తావు ఇచ్చేలా వ్యవహరించకూడదన్నారు.

## పరీక్షల మెటీరియల్ పంపిణీ



**తలకొండపల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలోని స్వీరోస్ సర్కిల్‌లోని 78 మంది విద్యార్థులకు స్థానికం ఆర్ఎంపీ డాక్టర్ రవినాయక్ ఉచితంగా పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. గురుకులంలో సీటు సంపాదించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేకర్, మాజీ సర్పంచ్ జ్యోతి, దీళి రవి, రమేష్, విఠల్, పండు, శ్రీశైలం, మధు పాల్గొన్నారు.

## చెరువు కట్టకు మరమ్మతులు

**తలకొండపల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ గ్రామంలోని చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టారు. గ్రామ పరిధిలో ఉన్నటువంటి మహమ్మద్ ఖాన్ చెరువు కట్టపై ఉన్నటువంటి మురికి తుమ్మ చెట్లను మరియు పిచ్చి మొక్కలను జేసీబీ మరియు డోజర్ సహాయంతో తీసివేసి చెరువు కట్టను క్లీన్ చేయడం జరిగింది. రైతులకు పొలాలకు పోవడానికి రావడానికి ఇబ్బందిగా ఉండటాన్ని చూసి సమస్యను పరిష్కరించడంకోసం వ్యక్తి గతంగా స్వంత కార్చుతోపనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచును అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్, రావిచెడ్ అంజయ్య గౌడ్ పులిజాల వెంకటయ్య రాజమోని రాములు రాజమోని శ్రీరాములు అంబటి లింగయ్య జినుకుంట్ల స్వామి గౌడ్ కానుగుల రవి రాజమోని రామచంద్రయ్య మురళి రెడ్డి పాల్గొనడం జరిగింది.

## 150 మంది విద్యార్థులకు ప్యాడ్‌ల వితరణ

**తలకొండపల్లి, ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో రావిచేడు, తలకొండపల్లి, చంద్రదన, చుక్కాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో విద్యా సహాయ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు గ్రామాలలోని 150 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులను కల్పించాలనే ఉద్దేశంతో ఈ వితరణ జరిగింది. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. మొత్తం 550 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ ప్రతినిధులు (సర్పంచ్, వార్డు సభ్యులు), పాఠశాల ఉపాధ్యాయులు మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు అవసర మని పేర్కొన్నారు.



## 20వ వార్డులో బోరు పునరుద్ధరణ

**షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** నెల రోజులుగా బోరుపాడై తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 20వ వార్డులో కొత్త కౌన్సిలర్ గా అడుగుపెట్టిన పినమోని గోపాల్ బోరును బాగు చేయించారు. బోరు సమస్యను వార్డు ప్రజల దృష్టికి తీసుకు రాగానే స్పందించిన ఆయన స్థానిక గంజి రోడ్ లో గల ఈ బోరును బాగు చేసి తాగునీటి ఎద్దడి తీర్చాడు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.